# సాక్షి తిరుపతి

గురువారం । 25 । జూలై । 2024





**దారాలు తీయమన్నందుకు..**

దుస్తులు ఆరేసే దారాలను తీయమన్నందుకు ఓ మహిళపై మరోవర్గం దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. - 8లో



**జాగిలాలతో స్మగ్లర్ల ఆటకట్టు**

ఎర్రచందనం స్మగ్లర్లను నియంత్రించేందుకు జాగిలాలకు శిక్షణ ఇచ్చినట్లు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. - 8లో



**అసాంఘిక కార్యకలాపాలకు..**

జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. - 8లో

## న్యూస్‌రీల్

### సకాలంలో రుణాలు ఇవ్వండి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** సకాలంలో బ్యాంకు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బ్యాంకర్ల కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలసి బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25కు సంబంధించి వ్యవసాయం, విద్య, ఎంఎస్‌ఎంఈ ఫుడ్ ప్రాసెసింగ్ తదితర ప్రాధాన్యత రంగాలకు రుణాలు ఇవ్వడంతో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, ఎల్డీఎం విశ్వనాథ్‌రెడ్డి, ఆర్బీఐ ఎల్‌డీఓ పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రాంప్రసాద్, నాబార్డ్ డీడీఎం సునీల్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.23 కోట్లు



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,23,73,531 వచ్చినట్లు ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీల ద్వారా బంగారం 124.400 గ్రాములు, వెండి 677.400 కిలోలు, విదేశీ కరెన్సీ నోట్లు 183 వచ్చినట్లు ఈఓ తెలిపారు. గతనెల 19వ తేదీ నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ శ్రేణులనే కాదు.. చివరకు చిరుద్యోగులను కూడా విడిచిపెట్టడం లేదు. గ్రామస్థాయిలో కీలకమైన అంగన్‌వాడీ, పారిశుద్ధ్య కార్మికులు, ఆశావర్కర్లు, డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై సైతం కత్తి కట్టారు. ప్రస్తుతం ఉన్న వారందరినీ తొలగించి జేబులు నింపుకోవడమే పరమావధిగా ఆయా స్థానాల్లో తమ వారిని నియమించుకునేందుకు సామదాన దండోపాయాలు ప్రయోగిస్తున్నారు. 'మా ప్రభుత్వం వచ్చింది.. మేము చెప్పిన వారే ఉండాలి. వేరే వాళ్లు ఉండడానికి వీల్లేదు.. దీనికి సంబంధించిన జాబితాను పంపిస్తాం.. అప్పటి వరకు వారిని ఉద్యోగాల్లోకి రానివ్వకండి' అంటూ కూటమి నేతలు ఉన్నతాధికారులకు అల్టిమేటం ఇచ్చారు. ఆయా ఉద్యోగాల్లో కొనసాగాలంటే ఒక్కో పోస్టుకు ఒక్కో రేటు ఫిక్స్ చేసి వసూళ్ల పర్వానికి తెరదీశారు. ఇప్పటికే పలువురు వసూల్‌రాజా అవతారాలెత్తి జేబులు నింపుకుంటున్నారు. వీరి ధాటికి చిరుద్యోగులు హడలిపోతున్నారు.



# చిరుద్యోగులపై కుట్ర

| ఉమ్మడి చిత్తూరు జిల్లా వివరాలు | తిరుపతి జిల్లా | చిత్తూరు జిల్లా |
|---|---|---|
| అంగన్ వాడీల్లో | 4,504 | 4,144 |
| పారిశుద్ధ్య కార్మికులు | 2,434 | 2,405 |
| ఆశావర్కర్లు | 1,686 | 1,526 |
| డీలర్లు | 1,457 | 1,379 |
| ఫీల్డ్ అసిస్టెంట్లు | 757 | 596 |



ఎక్కడెక్కడ ఎవరిని నియమించాలో టీడీపీ లెటర్ ప్యాడ్‌లో పేర్లు రాసి అధికారులకు పంపిన లేఖ

- ఉపాధి హామీ, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, డీలర్లు, అంగన్‌వాడీ వర్కర్లను తొలగించేందుకు కుట్రలు
- తమవారికి కట్టబెట్టేందుకు అధికారులకు కూటమి నేతల తప్పుడు ఫిర్యాదులు
- పలు చోట్ల ఉపాధి పనులను నిలిపివేయించిన వైనం
- రోడ్డున పడుతున్న చిరుద్యోగులు

**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు జేబులు నింపుకోవడమే పరమావధిగా ఆ పార్టీ నాయకులు దృష్టి సారించారు. తక్షణ ఆదాయం వచ్చే పథకమైన ఉపాధి హామీని ఆదాయ వనరుగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద మొత్తం 230 రకాల పనులు చేసుకోవచ్చు. వీటిలో ప్రధానంగా నీటి కుంటల నిర్మాణం, గుట్టల్లో కందకాలు, పొలం చుట్టూ సరిహద్దు కందకాలు, 'అమృత్ సరోవర్' స్కీమ్ కింద చెరువుల పనులు..ప్లాంటేషన్ పనులు ఎక్కువగా చేస్తున్నారు.. ఇలాంటి పనులను ఒప్పంద పద్ధతిలో టీడీపీ నాయకులే చేసుకునేందుకు తమకు అనుకూలమైన క్షేత్ర సహాయకులను నియమించుకోవాలని రంగంలోకి దిగారు.

**అంగన్‌వాడీ..డీలర్ల తొలగింపునకు కసరత్తు**

గ్రామాల్లో మరో కీలకమైన అంగన్‌వాడీ వర్కర్లు, రేషన్ డీలర్లను తొలగించి వారి స్థానంలో తమ వారిని నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే స్వచ్ఛందంగా తప్పుకోవాలని పలువురికి హుకుం జారీ చేశారు. భవిష్యత్తులో ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు కూటమి నేతలు పక్కా వ్యూహంతో రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ వర్కర్లపై ఒత్తిళ్లు తెచ్చి రాజీనామా లేఖలు రాయించుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం, సరుకులను విక్రయించి జేబులు నింపుకునేందుకు తమ అనుకూలమైన వర్కర్లను నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నుంచి రేషన్ సరుకులు ఇష్టానుసారంగా అమ్ముకుని సొమ్ము చేసుకోవడానికి వీలుగా తమకు అనుకూలురైన వారిని, నమ్మకస్తులను చౌక దుకాణాల డీలర్లను నియమించుకుంటున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం వర్కర్లను కూడా తొలగించి వారి స్థానాల్లో తమకు నచ్చిన వారినే అధికారులతో నియమించుకుంటున్నారు.

**పనులు ఆపేయండి**

ఫీల్డ్ అసిస్టెంట్లను తమ వారిని నియమించుకునే దిశగా కూటమి నేతలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు నిలుపుదల పక్కాగా స్కెచ్ వేశారు. వారి ఒత్తిడి మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పంచాయతీల్లో ఉపాధి పనులను ఆపేశారు. పనిచేస్తున్న సహాయకులను తొలగించి తాము చెప్పిన వారిని నియమించమని టీడీపీ నాయకులు అధికారులకు లేఖలు పంపుతున్నారు. ఇప్పటికే కొందరు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు పంచాయతీల వారీగా మార్పు చేయాల్సిన వారి జాబితాలను అందజేసి, ఆయా పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు, టీఏలు, ఏపీఓలపై బెదిరింపులకు దిగారు. చేసేదేమీలేక ఏపీఓలు కూటమి నేతలు చెప్పినట్లు నడుచుకుంటున్నారు. ఈ దిశగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లపై తప్పుడు ఫిర్యాదులు చేయించి తొలగించేందుకు పూనుకున్నారు. వలంటీర్ పోస్టుల భర్తీ ప్రక్రియపై స్పష్టత లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు టీడీపీలోని పలువురు కార్యకర్తలు పోటీ పడుతున్నారు. క్షేత్రస్థాయిలో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ వారు ఉంటే నిధులు స్వాహాకు అడ్డే ఉండదని భావించి చిరుద్యోగులపై ప్రతాపం చూపుతున్నారు. చిరు ఉద్యోగాన్నే నమ్ముకుని కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను కూటమి నేతలు స్వార్థ ప్రయోజనం కోసం రోడ్డున పడేస్తున్నారు. పనులు నిలిచిపోవడంతో అనేక మంది ఎలాగైనా పట్టణాల్లో పనులు చేసుకుని కుటుంబాలను పోషించే ప్రయత్నాల్లో ఉన్నారు.

**పారిశుద్ధ్య కార్మికులనూ విడిచిపెట్టని వైనం**

కూటమి నేతలుచివరకు ఎంతగా దిగజారారంటే పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులపై సైతం తమ ప్రతాపం చూపుతున్నారు. ఆ పనుల్లో కూడా తమ వారే ఉండాలంటూ ఒత్తిళ్లు చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుల్లో ఎక్కువ మంది పేదవారే ఉంటారు. వారికి పార్టీలతో సంబంధం ఉండదు. ఎవరూ చేయలేని పనులు కూడా చేసి గ్రామాలు శుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తూ ఉంటారు. ఆ అల్పజీవుల కడుపు కొట్టేందుకు కూడా కూటమి నేతలు చేస్తున్న ప్రయత్నాలను చూసి ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**లెటర్ ప్యాడ్‌లో తొలగింపుల జాబితా**

చిత్తూరు జిల్లా పరిధిలో ముగ్గురు టీడీపీ నాయకులు వారి మనుషులను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకునేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఓ జాబితాను సిద్ధం చేసి టీడీపీ నాయకుల లెటర్ ప్యాడ్‌లో పేరు, ఊరు రాసి ఉన్నతాధికారికి లేఖ పంపారు. పూతలపట్టు నియోజకవర్గంలో మొత్తం 60 మందిని క్షేత్రసహాయకులను తొలగించి వారి స్థానంలో టీడీపీ నాయకుల బంధువులు, సన్నిహితులను నియమించేందుకు రంగం సిద్ధం చేశారు.

**ఒక్కొక్కరికి ఒక్కో రేటు ఫిక్స్!**

ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు, ఆశావర్కర్లు కొనసాగాలంటే గ్రామస్థాయి నాయకుడికి కొంత మొత్తం ఇవ్వాలి. ధనార్జనే ధ్యేయంగా కూటమి నేతలు ఒక్కొక్కరికి ఒక్కో రేటు నిర్ణయించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు, రేషన్ డీలర్లు రూ.50వేల నుంచి రూ.లక్ష, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు రేటు నిర్ణయించినట్లు ప్రచారంలోకి వచ్చింది. డబ్బులిస్తే సరి..లేదంటే తప్పుకోవాలంటూ కూటమి నేతల బెదిరింపులపై ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఇటీవల తిరుపతి కలెక్టరేట్ వద్ద కందారపు మురళి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేయడమే ఇందుకు నిదర్శనం.

**తొలగించేందుకు గ్రామసభ!**

శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ, కాసరంలో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడానికి వచ్చేనెల 3న గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలియవచ్చింది. ఎంపేడు, మన్నవరంలో అంగన్‌వాడీ వర్కర్లను తొలగించి తమ వారిని నియమించుకునేందుకు టీడీపీ నేతలు రంగం సిద్ధం చేశారు. ఎవరినైతే తొలగించాలకున్నారో వారికి సంబంధిత అధికారి చేత మెమోలు ఇప్పించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులను తొలగించి ఇదే రీతిలో పావులు కదుపుతున్నారు. వచ్చేనెల మొదటి వారంలో నియోజకవర్గ పరిధిలో పలువురు చిరుద్యోగులను తొలగించేందుకు వారిపై లేనిపోని అపవాదులు మోపుతున్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

- శాంతి భద్రతల పటిష్టతకు ప్రత్యేక చర్యలు
- అక్రమ రవాణా నియంత్రణకు రహదారుల్లో గట్టి నిఘా వ్యవస్థ ఏర్పాటు
- ఎస్పీ సుబ్బారాయుడు



నారాయణవనం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

**నారాయణవనం:** గంజా, సారా విక్రయాలు, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తూ రౌడీషీటర్లు, స్మగ్లర్లపై నిఘా పెంచాలని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. బుధవారం ఆయన నారాయణవనంలోని రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని, నారాయణవనం, వరదయ్యపాళ్యం పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఎస్‌హెచ్‌ఓ, సిబ్బంది పనితీరును సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ తదితర రికార్డులను తనిఖీ చేశారు. డీఎస్పీ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించాలన్నారు. జాతీయ రహదారుల్లో అక్రమ రవాణాకు తావు లేకుండా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలు, ఫేక్ లోన్ యాప్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, మహిళా సంబంధిత నేరాల పట్ల వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రముఖ ఆలయాలు, పర్యాటక కేంద్రాల్లో బందోబస్తును పెంచి, భక్తులకు, పర్యాటకులకు రక్షణ కల్పించాలని సూచించారు. పుత్తూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో కేడీలు, రౌడీషటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిఘా పెంచి, నేర నివారణకు ఈ-బీట్ సిస్టం పనితీరును మరింత మెరుగుపరచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయకుండా బ్లూకోల్ట్స్, బీట్ సిస్టంను బలోపేతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ వెంట పుత్తూరు డీఎస్పీ శ్రీనివాస రావు, సీఐలు ఓబులేసు (పుత్తూరు అర్బన్), భాస్కర్ నాయక్ (పుత్తూరు రూరల్) ఉన్నారు.

**పుత్తూరులో..**

**పుత్తూరు:** జిల్లాలో శాంతిభద్రతల పటిష్టతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తిరుపతి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, వరదయ్యపాళెం స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ గంజాయి, సారా, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రహదారుల్లో నిఘా వ్యవస్థను పెంచుతున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో హుందాగా మాట్లాడి, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించినట్లు వివరించారు. ఎస్పీ వెంట పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావు ఉన్నారు.

## క్లుప్తంగా

### ఇంటర్‌లోనూ మంచి మార్కులు సాధించండి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** ఇంటర్మీడియెట్‌లోనూ విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇటీవల 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన పిల్లలకు రూ.15వేలు నగదును కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్ చేతుల మీదుగా అందించారు. బెంగళూరుకు చెందిన సీఏజీఎల్ కంపెనీ ఆర్థిక సౌజన్యంతో విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. అనంతరం చిన్నమ్మాయి, ధరణి, హరిత, వైష్ణవి, మౌనిక, లావణ్య తదితర విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, సీఏజీఎల్ కంపెనీ లైజన్ ఆఫీసర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రొఫెసర్ మూర్తికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



**తిరుపతి సిటీ:** శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్‌డీఎస్ మూర్తికి నోయిడాలోని సొసైటీ ఫర్ ప్లాంట్ రీసెర్చ్ సంస్థ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. ఈయన ప్లాంట్ బయోకెమిస్ట్రీ మీద పలు పరిశోధనలను చేసి, సుమారు 54 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. 2019లో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా అవార్డును, 2022లో వైఎస్ఆర్‌కే శర్మ మెమోరియల్ అవార్డును, 2023లో ఫెలో ఆఫ్ అగ్రికల్చరల్ బయోకెమిస్ట్ అవార్డులను సాధించారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

## శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

**తిరుపతి సిటీ:** తిరుపతి కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. విద్యాప్రమాణాల్లో మార్పులకు అనుగుణంగా కళాశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా యాజమాన్యం పనిచేస్తోందన్నారు. కళాశాలలో చదవిన వేలాదిమంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థాయిలో ఉండడం సంతోషకరమన్నారు. ఇటీవలే శ్రీరామ కళాశాలకు యూజీసీ నాక్ ఏ గ్రేడ్ లభించిందన్నారు. ఇందుకు కృషిచేసిన చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డికి, ప్రిన్సిపల్ జయచంద్ర, అధ్యాపక బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఫైనల్ చేరిన తిరుపతి, అనంతపురం జట్లు



**తిరుపతి సిటీ:** పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా గత రెండు రోజులుగా జరుగుతున్న అండర్–14 బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల టోర్నీ రసవత్తరంగా కొనసాగుతోంది. రెండవరోజు జరిగిన సెమీ ఫైనల్స్‌లో తిరుపతి జిల్లా జట్టు కర్నూలు జిల్లా జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. అదేవిధంగా సత్యసాయి జిల్లా జట్టు మరోమ్యాచ్‌లో తలపడిన అనంతపురం జట్టు ప్రతిభ కనబరచి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గురువారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో తిరుపతి, అనంతపురం జట్లు తలపడనున్నాయి.

## గంజాయి స్వాధీనం

**తిరుపతి క్రైమ్:** నగరంలో నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అలిపిరి ఇన్‌చార్జ్ సీఐ జయనాయక్ తెలిపిన వివరాల మేరకు.. జీవకోన లింగేశ్వర స్వామి వారి ఆలయం 100 మీటర్ల సమీపంలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో గంజాయితో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వారిని పట్టుకుని విచారించగా వారి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న జగదీష్, బాలిపోగు సుమన్‌ను కూడా అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామన్నారు.

## జాగిలాలతో ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టు

**తిరుపతి మంగళం :** ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్సు జాగిలాల పనితీరును బుధవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ పరిశీలించారు. హంటర్, గంగ పేర్లు గల ఈ జాగిలాలు టాస్క్‌ఫోర్సు కార్యాలయ ప్రాంగణంలో పని తీరును ప్రదర్శించాయి. ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించేందుకు ఈ జాగిలాల సేవలను కూడా అదనంగా వినియోగించడంపై దృష్టి సారిస్తామని ఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్సుకు ఐదు జాగిలాలు ఉన్నాయని, రెండు తిరుపతిలో, మిగిలిన మూడు కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్‌లో ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అనుమానిత చెక్‌పోస్టులతో పాటు, అటవీ ప్రాంతాల వైపు ప్రయాణించే వాహనాలను జాగిలాల ద్వారా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో డంపులను ఏర్పాటు చేసి ఉంటారని, వీటిని జాగిలాలు వెంటనే కనుగొనే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రయోగాత్మకంగా టాస్క్‌ఫోర్స్ కార్యాలయం ప్రాంగణంలో జాగిలాల పనితీరును పరిశీలించగా, అవి విజయవంతంగా పని చేశాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, జాగిలాల ట్రైనర్లు పాల్గొన్నారు.

## 118 మంది టీచర్లకు అన్యాయం

– కోర్టును ఆశ్రయించిన బాధితులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న టీచర్లకు ఎన్నికలకు ముందు ప్రభుత్వ బదిలీలకు (గవర్నమెంట్ ఆర్డర్స్)కు దరఖాస్తు చేసుకున్నారు. వారి సమస్యలను పరిశీలించిన గత ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 118 మందికి ప్రభుత్వ బదిలీలకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులు పొందిన టీచర్లను ఎన్నికల కోడ్ ఉండడంతో మరొక ప్రాంతానికి బదిలీ చేయకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు మిన్నకుండిపోయారు. అలాగే ఉత్తర్వులు పొందిన టీచర్లను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయలేదు. ఈ సమస్యపై స్పష్టత ఇవ్వాలని ఇటీవల పలు జిల్లాల డీఈఓలు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ప్రస్తుత ప్రభుత్వం 118 టీచర్ల జీవోలను ఆమోదించడం లేదంటూ ఈ నెల 24న ఉత్తర్వులు జారీచేసింది. గత ప్రభుత్వంలో జీఓలు పొందిన తమకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని అయ్యోర్లు లబోదిబోమంటూ మండిపడుతున్నారు. ఈ సమస్యపై పలువురు టీచర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## 27న జాబ్‌మేళా

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఐదు ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194ను సంప్రదించాలని కోరారు.

## 1న కెమెరాల ఈ-వేలం

**తిరుపతి(అలిపిరి):** తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కెమెరాలను ఆగస్టు 1న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. ఇందులో నికాన్, కెనాన్, కొడాక్ తదితర కెమెరాలు ఉన్నాయన్నారు. ఉపయోగించినవాటితోపాటు పాక్షికంగా దెబ్బతిన్న కెమెరాలు మొత్తం 10 లాట్లు ఈ–వేలంలో ఉంచారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయంలో గానీ, 0877–2264429 నంబరులో కార్యాలయం వేళల్లో సంప్రదించవచ్చు. అలాగే టీటీడీ వెబ్‌సైట్ www. tirumala. org లేదా రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ www.konugolu.ap.gov.in ను చూడొచ్చు.



## ఢిల్లీ ధర్నాలో ఉమ్మడి జిల్లా నేతలు



ఢిల్లీలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్, ధర్నాలో పాల్గొన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ చైర్మన్ శ్రీనావాసులు

**తిరుపతి మంగళం :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై విచక్షణా రహితంగా చేసిన దాడులు, ఆస్తుల ధ్వంసం వంటి వారి అరాచకాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో భారీ ధర్నా నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నేతలు పెద్దఎత్తున ఢిల్లీ ధర్నాకు వెళ్లారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట, తిరుపతి ఎంపీలు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, మద్దిల గురుమూర్తితో పాటు చంద్రగిరి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, రాజేష్ ధర్నాలో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న నేదురుమల్లి, భూమన అభినయ్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్

## అందరికీ అందుబాటులో ఉంటా

- దేవుడు పాదాల చెంత మళ్లీ ఉద్యోగం నా అదృష్టం
- జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్
- జేసీగా బాధ్యతల స్వీకరణ



తిరుపతి జేసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శుభం బన్సల్

**తిరుపతి అర్బన్:** తిరుమల ఏడుకొండల వేంకటేశ్వర స్వామి పాదాల చెంత మళ్లీ ఉద్యోగం చేసే అవకాశం దక్కడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మన్యం జిల్లాలోని సీతం పేట ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పని చేస్తూ బదిలీపై తిరుపతి జేసీగా విచ్చేశారు. గతేడాది డిసెంబర్ 23వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 16వ తేదీ వరకు ఈయన తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇక్కడ జేసీగా పని చేస్తున్న ధ్యానచంద్ర విజయవాడ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ కావడంతో మళ్లీ ఈయనకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కొద్దిరోజులు మాత్రమే జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశానని, ఇప్పుడు మరోసారి ఇక్కడ పని చేసే చాన్స్ రావడం సంతోషంగా ఉందని చెప్పారు. జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తామని తెలిపారు.

**తరచూ మారుతున్న జేసీలు**

జిల్లా జాయింట్ కలెక్టర్లు తరచూ బదిలీ అవుతున్నారు. 5వ జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్ బాధ్యతలు చేపట్టారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా తిరుపతి కొత్త జిల్లాగా 2022 ఏప్రిల్ 4వ తేదీన ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థానంలో ఐదుగురు జేసీలు మారారు.

**జిల్లాలో పని చేసిన జేసీలు..**

జిల్లాకు ఐదో జేసీగా శుభం భన్సల్

- డీకే బాలాజీ : 2022 ఏప్రిల్ 4వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9 వరకు
- కె.పెంచల కిషోర్(ఐసీ) : 2023 డిసెంబర్ 10వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 22 వరకు
- శుభం బన్సల్: 2023 డిసెంబర్ 23 నుంచి 2024 మార్చి 16 వరకు
- హెచ్‌ఎం ధ్యానచంద్ర: 2024 మార్చి 15 నుంచి 2024 జూలై 23 వరకు
- శుభం బన్సల్: 2024 జూలై 24న జేసీగా బాధ్యతల స్వీకరణ

## దుస్తులు ఆరేసే దారాలు తీయమన్నందుకు..

- మహిళపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన మరో మహిళ, వారి బంధువులు
- పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించిన బాధిత కుటుంబం
- పోలీసుల ఎదుటే మరోసారి బాధిత మహిళపై దాడి
- న్యాయం చేయాలంటూ ఎస్పీని ఆశ్రయించిన వైనం



లక్ష్మీపై దాడికి పాల్పడుతున్నట్లు సీసీ ఫుటేజ్‌లో నమోదైన దృశ్యాలు

**చంద్రగిరి:** ఇంటిపై దుస్తులు ఆరేసేందుకు కట్టిన దారాలను తీసేయాలని కోరిన మహిళపై పక్కింటి వారు విచక్షణరహితంగా దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండల పరిధిలోని తొండవాడ పంచాయతీ ఓం శక్తి వీధికి చెందిన లక్ష్మి, కిరణ్ కుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి పక్కనే లావణ్య అనే మహిళ కాపురం ఉంటోంది. అయితే గత కొంతకాలంగా లక్ష్మీ ఇంటిపై ఉన్న సిమెంట్ పిల్లర్స్‌కు లావణ్య దుస్తులు ఆరేసేందుకు దారాలు కడుతూ వారికి అసౌకర్యం కలిగిస్తోంది. ఈ క్రమంలో శనివారం తమ ఇంటిపై దారాలు ఎందుకు కడతారు ? వాటిని తీయాలని లావణ్యను కోరింది. దీంతో లక్ష్మిని దుర్భాషలాడుతూ లావణ్య చెప్పుతో దాడికి పాల్పడింది. అంతటితో ఆగకుండా బంధువులను పిలిపించి, వారితో మరోసారి లక్ష్మిపై దాడి చేయించింది. ఈ క్రమంలో లావణ్య బంధువులు, లక్ష్మిని పరుష పదజాలంతో దూషించారు. దీంతో బాధిత మహిళ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసుస్టేషన్‌లోనే మారోమారు తనపై లావణ్య బంధువులు దాడికి పాల్పడ్డారని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తతో పాటు ఇంటర్మీడియెట్ చదువుతున్న తన కుమార్తెను పోలీసులు అన్యాయంగా లోపల కూర్చోబెట్టారని, తాము ఫిర్యాదు చేస్తే, పోలీసులు దాడి చేసిన వారి పక్షాన మాట్లాడుతున్నారని వాపోయింది. లావణ్యతో పాటు వారి బంధువులు కేసును వాపసు తీసుకోవాలంటూ ఒత్తిళ్లకు పాల్పడుతున్నారని, కేసు వాపసు తీసుకోకపోతే నీ కూతురు కళాశాలకు ఎలా వెళ్తుందో చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు కన్నీరు పెట్టుకుంది. విదేశాల్లో ఉన్న వారి బంధువులు సైతం ఫోన్‌లు చేసి చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వారు తెలిపారు. గత కొద్దికాలంగా కాలనీలోని పలువురిపై లావణ్య తరపు వాళ్లే ఇదే రీతిలో దాడులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. బుధవారం బాధితులతో పాటు స్థానిక కాలనీ వాసులు తిరుపతి ఎస్పీని ఆశ్రయించి, తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

## రూ.1.21 కోట్లకు ఐపీ పెట్టిన వ్యాపారి

**తిరుపతి లీగల్ :** పట్టణంలోని ఎంఆర్ పల్లి పరిధిలో ఉన్న శ్రీనగర్ కాలనీకి చెందిన కె.మనోహర్ రెడ్డి తిరుపతి అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఒక కోటి 21 లక్షల 96 వేల రూపాయలకు ఐపీ దాఖలు చేసినట్టు ఆయన తరపు న్యాయవాది పత్తికొండ మురళి తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు.. పిటిషనర్ మనోహర్ రెడ్డి తిరుపతి, తిరుమలలో ఇత్తడి విగ్రహాలు, నాణేల వ్యాపారం నిర్వహించేవాడు. కోవిడ్‌తో అతనికి వ్యాపారంలో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అతను కొంతమంది వద్ద అధిక వడ్డీలకు నగదు అప్పుగా తీసుకున్నాడు. వ్యాపారంలో పోటీ పెరగడంతో వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి అతను తిరుమలలో హాకర్ లైసెన్సు తీసుకుని వ్యాపారాన్ని ప్రారంభించాడు. దీనికిగాను అతను మరి కొంతమంది వద్ద సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. మొదట్లో తీసుకున్న అప్పులు, మళ్లీ తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆ వ్యాపారాన్ని యజమానికి అప్పగించాడు. తన పిల్లలను చదివించుకోవడానికి అతను ఓ ప్రైవేటు చిట్స్‌లో సభ్యుడిగా చేరాడు. అయితే ఆ చిట్ యజమానులు సొమ్ము తీసుకుని పరారయ్యారు. ఇదివరలో తీసుకున్న సొమ్ముకు వడ్డీలు అధికం కావడంతో పాటు చిట్స్‌లో వేసిన సొమ్మును యజమానులు చెల్లించకపోవడంతో రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఈ ఐపీని దాఖలు చేసినట్టు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నాడు. 37 మంది రుణదాతలను ఆయన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చాడు.

## నాగపట్ల బీట్‌లో ఎర్రచందనం స్వాధీనం



దుంగలను చూపుతున్న ఫారెస్టు అధికారులు

**భాకరాపేట:** శేషాచలం అటవీ ప్రాంతంలోని నాగపట్ల ఈస్ట్ బీట్‌లో 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. భాకరాపేట ఫారెస్టు కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు భాకరాపేట ఘాట్ రోడ్డు మార్గం నుంచి నాగపట్ల కనుమ, ఈస్ట్ బీట్ వరకు వేర్వేరుగా కూంబింగ్ చేపట్టామన్నారు. నాగపట్ల ఈస్ట్ బీట్ పరిధిలోని ఈతగుంట వద్ద దుంగలు తీసుకొస్తున్న ఏడుగురిని గుర్తించి వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు రాళ్లు విసురుతూ పారిపోయారన్నారు. వారి కోసం రెండు బృందాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఆ ప్రాంతంలో 243 కేజీలు బరువు ఉన్న సుమారు రూ.6 లక్షలు విలువ చేసే 7 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కూంబింగ్‌లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వేణు, ఎఫ్‌బీఓ రవి, రెడ్డెప్పరెడ్డి, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.